

19న నంది కొండల్లో కేబినెట్ సమావేశం

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విధానసౌధలో కేబినెట్ సమావేశాల సంప్రదాయంలో కొంత మార్పు తీసుకొస్తున్నారు. ఈనెల 19న చిక్కబళ్లాపుర జిల్లా పరిధిలోని నందిగిరిధామలోని మయూర సభాంగణంలో కేబినెట్ భేటీ నిర్వహిస్తున్నట్లు కేబినెట్ సెక్రటరీ చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటించారు. తొలుత ఈనెల 12న గురువారం విధానసౌధలో కేబినెట్ భేటీ ఉంటుందని ఆయన తెలిపారు. ఇటీవల మంత్రివర్గ సమావేశాలు వివిధ ప్రాంతాలలో నిర్వహించే సంప్రదాయం పాటిస్తున్నారు. ఇటీవల కలబురగి, చామరాజనగర జిల్లా మలెమహదేశ్వరలోనూ సమావేశాలు జరిగాయి.

జంట సొరంగ మార్గాలకు గ్రీన్ సిగ్నల్



- బీఓటీ పద్ధతిన నిర్మాణాలు ● హెబ్బాళ నుంచి సిల్క్‌బోర్డ్ దాకా...
- 33.490 కిలోమీటర్ల సొరంగ మార్గం ● రెండు ప్యాకేజీల్లో పనులు
- రూ.17,780 కోట్ల అంచనా ● కి.మీ.కు రూ.19 టోల్ వసూలు
- డీపీఆర్ సిద్ధం చేసిన సర్కార్ ● నగరవాసులకు తీరనున్న ట్రాఫిక్ సమస్య

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ట్రాఫిక్ అంటేనే నగరవాసులు బెంబేలెత్తే పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. కిలోమీటరు ప్రయాణించాలంటే ఒక్కోసారి 10 నిమిషాలనుంచి అరగంట సమయం తప్పదు. ఏ మార్గంలోనైనా ఓ చిన్న ప్రమాదం లేదా ఓ సంబరం, ర్యాలీ వంటివి సాగితే ఇక ఆప్రాంతంలో గంటలకొద్దీ ముందుకెళ్లే పరిస్థితి ఉండదు. ఇది నగరంలో కొనసాగుతున్న ట్రాఫిక్ సమస్య. దశాబ్దాలకాలంగా నగర ట్రాఫిక్‌కు శాశ్వతమైన పరిష్కారం చూపాలని ప్రణాళికలు వేస్తున్నారుగానీ ఆచరణలో సాధ్యం కావడం లేదు. ఒకప్పుడు రోడ్లు విస్తరణ చేస్తే సమస్య కొంత మెరుగవుతుందని భావించారు. మరోవైపు భారీ వాహనాలను కేవలం రాత్రివేళల్లో మాత్రమే నగరంలోకి అనుమతించాలని నిర్ణయించారు. మెట్రో రైళ్లు వస్తే వీటన్నింటినీ ఓ కొలిక్కి తెచ్చినట్లు అవుతుందని భావించారు. కానీ ట్రాఫిక్ సమస్యకు తెర పడలేదు. పదేళ్లకిందటి నాటి పరిస్థితి పోలిస్తే నగరంలో ట్రాఫిక్ మరింత పెరిగింది. బళ్ళారి రోడ్డు నిరంతరం రాత్రి లేదు.. పగలు లేదు... వాహనాల రద్దీ ఉంటుంది. డైరీ సర్కిల్, కోరమంగల, ఎంజీ రోడ్డు, రిచ్‌మండ్ రోడ్డు, బ్రిగేడ్, జయనగర్, కనకపుర రోడ్డు, బన్నేరుఘట్ట రోడ్డు వెడల్పు చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఇక వైట్‌ఫీల్డ్, సర్జాపుర ప్రాంతానికి వెళ్లాలంటే టిన్‌ఫ్యాక్టరీ దాటడమే గగనం అనిపిస్తోంది. మైసూరు రోడ్డులో ట్రాఫిక్ రద్దీ కొనసాగుతూనే ఉంది. ట్రాఫిక్ సమస్య తీవ్రమయ్యేందుకు కారణం, నగరంలో జనాభా పెరగడం మరోవైపు వలసలు, ఉద్యోగాలకోసం వచ్చేవారి సంఖ్య ఏటా లక్షలు దాటుతోంది.

డీపీఆర్ సిద్ధం..

ఇలా నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వతమైన పరిష్కారం చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాండ్ బెంగళూరులో భాగంగా పలు ప్రాజెక్టులు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. అందులో జంట సొరంగమార్గాల నిర్మాణం ఒకటి. నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణం దాకా సొరంగ మార్గాన్ని నిర్మించే ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. హెబ్బాళ ఎస్టీమ్‌మాల్ నుంచి హెచ్ఎస్ఆర్ లే అవుట్ సిల్క్‌బోర్డ్ జంక్షన్ దాకా ఉత్తర-దక్షిణ కారిడార్‌ను రెండు సొరంగ మార్గాలను నిర్మించాలని నిర్ణయించారు. 33.490 కిలోమీటర్ల సొరంగ మార్గ నిర్మాణానికి 26 నెలలు తవ్వకాలు, 12 నెలల నిర్మాణాలు అంచనాలతో చేపట్టదలిచారు. 2 ప్యాకేజీలతో కలిపి 17,780 కోట్ల రూపాయలు అంచనాకు పాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రోడిక్ కన్సల్టెంట్స్ సమర్పించింది. కార్యాచరణ నివేదిక ఆధారంగా అదనపు అధ్యయనం చేపట్టేందుకు డీపీఆర్ తయారు చేశారు.

కిలోమీటర్‌కు రూ.19 రుసుం..

ప్యాకేజ్1లో ఉత్తరభాగంలో రూ.4,614 కోట్లు, ప్యాకేజ్2లో దక్షిణభాగంలో రూ.4,689 కోట్లు అంచనావేశారు. మొత్తం 16.745 కిలోమీటర్ల పొడవు జంట సొరంగ మార్గాలు, 2/3 లేన్‌ల రోడ్డు, ప్రవేశం, నిర్గమనంతోపాటు కార్యాచరణ, నిర్వహణలు అనుబంధంగా ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తయ్యాక పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా కారు, ఇతర వాహనాలకు సొరంగమార్గంలో ప్రయాణించేందుకు కిలోమీటరుకు రూ.19 చొప్పున టోల్ వసూలు చేయాలని నిర్ణయించారు. ముంబై నగరంలో ట్రాన్స్‌హార్బర్ పై ఓవర్ 22 కిలోమీటర్లు ఉండగా రూ.250 వసూలు చేస్తున్నారు. సొరంగమార్గం నిర్మాణాలు మూడేళ్లలో పూర్తి కావచ్చునని అంచనా వేశారు. దీని ప్రకారం 2029 నుంచి 2030 వరకు ప్రతి కిలోమీటరుకు రూ.19 సమంజసమైన రుసుంగా అభిప్రాయపడుతున్నారు.



అత్యాధునిక హంగులతో పనులు


జంట సొరంగాలను అత్యాధునిక హంగులతో నిర్మించనున్నారు. పలు సంవత్సరాల ట్రాఫిక్‌ను అంచనా వేసి, అత్యుత్తమ నాణ్యతతో పనులు చేపట్టనున్నారు. ఉత్తర-దక్షిణ కారిడార్, తూర్పు-పడమర కారిడార్‌లతో కలిపి 40 కిలోమీటర్ల పొడవుతో సొరంగ మార్గం ఉండనుంది. రహదారిని అత్యాధునిక హంగులతో నిర్మించనున్నారు. 109.5 కిలోమీటర్ల పొడవుతో 16 ఎలివేటెడ్ కారిడార్లు, 40.50 కిలోమీటర్ల పొడవుతో డబుల్ డెక్కర్ మెట్రోకు అనుబంధమైన ఫ్లై ఓవర్‌ల నిర్మాణాలలో కలిపి 3 మెగా ప్రాజెక్టులు తీసుకురానున్నారు. భవిష్యత్తు అంచనాలతో, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిర్మించనున్నారు. ఇందులో అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.40వేలకోట్లతో అంచనా వేశారు. ఇది ఒకభాగంలో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ప్రాజెక్టు ముఖ్యాంశాలు

విశ్వవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన నగరంగా గుర్తింపు పొందిన బెంగళూరు వేగంగా విస్తరిస్తోంది. అందుకు ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలంలో పరిష్కారం చూపేలా ప్రాజెక్టును రూపొందించారు. బెంగళూరు నగర సమగ్ర సంచార ప్రాజెక్టు కోసం అల్టినాక్ కన్సల్టింగ్ ఇంజనీరింగ్ సంస్థ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసింది. 3 మెగా ప్రాజెక్టులు పూర్తయితే ప్రస్తుతం బెంగళూరులో గంటకు 15 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యాన్ని 25-30కిలోమీటర్లకు పెంచవచ్చు. 4 సంస్థలు రూపొందించిన ప్రాజెక్టులకు సంబంధించి అభిప్రాయాల నివేదికలను పరిశీలించి సిఫారసు చేశారు. ప్రభుత్వం సొరంగ మార్గ నిర్మాణాన్ని బీఓఓటీ (బిల్డ్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) విధానంతో నిర్మించాలని నిర్ణయించారు. తద్వారా ప్రభుత్వానికి ఆర్థికభారం నుంచి మినహాయింపు ఇచ్చినట్లు అవుతుంది. సొరంగ మార్గ నిర్మాణాలకు జాతీయస్థాయిలో పలు సంస్థలు ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది. సొరంగమార్గ నిర్మాణాల తవ్వకాలకు కనీసం రెండేళ్లకుపైగా సమయం పట్టనుంది. ఆ తర్వాత పూర్తిస్థాయి నిర్మాణాలకు మరో ఏడాది అవసరం. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వచ్చే ఏడాది ప్రారంభంలో శ్రీకారం చుట్టినా సమగ్రంగా పూర్తయ్యేందుకు 2029 సంవత్సరం కానుంది. పటిష్టంగా నిర్మించనున్నారు.

బెంగళూరు పరిసరాల్లో 85 చిరుతలు

- కెమెరా ట్రాప్‌ల ద్వారా గణన
- ఇతర వన్యప్రాణులూ సంచారం
- నేచర్ ఫౌండేషన్ బృందం వెల్లడి



బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిసరాలలో 85 చిరుతలు ఉన్నట్లు పర్యావరణ నిపుణుడు డాక్టర్ సంజయ్ గుబ్బి నేతృత్వంలోని హోళిమత్తె నేచర్ ఫౌండేషన్ బృందం అధ్యయనంలో గుర్తించింది. కెమెరా ట్రాప్‌ల ఆధారంగా ఏడాదిపాటు అధ్యయనం చేశారు. 80-85 చిరుతలు ఉన్నట్లు నిర్ధారించారు. ప్రధానంగా బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం, యూఎం కావల్, తురహళ్ళి, సూలికెరె, తురహళ్ళిగుడ్డ, హెసరఘట్ట, మారసంద్ర, మండూరుతోపాటు 282 చదరపు కిలోమీటర్ల పరిధిలో వీరు అధ్యయనం చేశారు. బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలో 54, బెంగళూరు సరిసరాల్లో 30 చిరుతలు ఉన్నట్లు గుర్తించారు. చిరుతలతోపాటు ఇతర వన్యప్రాణులు కూడా సంచరిస్తున్నట్లు వారు గుర్తించారు. ఈ అధ్యయన నివేదికను గురువారం ప్రకటించారు. 4 చిరుతలు ప్రమాదంలో ఉన్నట్లు 27 వన్యజీవి సంరక్షణకేంద్రంలో రక్షించారు. దీన్ని బట్టి బెంగళూరు పరిసరాలలో వన్యజీవుల నైసర్గిక ప్రదేశాలను సంరక్షించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఈ అధ్యయనంలో పలు సిఫారసులను చేశారు. వన్యజీవి, ఇతర ప్రాణుల సంరక్షణకోసం రిజర్వు ప్రదేశాన్ని ప్రకటించాలని దుర్గదకల్, బెట్టహళ్ళివాడలో కేటాయించిన అటవీప్రదేశాన్ని సంరక్షించాలని నివేదికలో సూచించారు. బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం పరిధిలోకి జేఐ బాచహళ్ళి, ఎం మనియంబల్ ప్రదేశాలను చేర్చాలని సూచించారు. మునేశ్వరబెట్ట - బన్నేరుఘట్ట వన్యజీవి సంరక్షణ కారిడార్ సంరక్షణకు అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బంధించిన చిరుతలను బన్నేరుఘట్ట జూకు అప్పగించే ప్రక్రియను నిలిపివేయాలని సిఫారసు చేశారు. చిరుతలు అటవీ ప్రాంతాల్లో ఉండనివ్వాలని, వాటిని బంధించి కట్టడి చేయాలనుకోవడం సరికాదన్నారు.

ఏడీజీపీ హేమంత్ నింబాల్కర్ బదిలీ

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇంటెలిజెన్స్ ఏడీజీపీ హేమంత్ నింబాల్కర్‌ను బదిలీ చేశారు. అయితే ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సమాచారశాఖ కమిషనర్ హోదా యథావిధిగా కొనసాగనుంది. రాష్ట్రప్రభుత్వం శుక్రవారం పలువురు ఐపీఎస్‌లను అకస్మికంగా బదిలీ చేసింది. కేవీ శరత్‌చంద్రను పోలీస్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ ఎండీగా బదిలీ చేశారు. మురుగన్‌ను పోలీస్ రిక్రూట్‌మెంట్ విభాగానికి, ఆర్ హితేంద్రను ట్రాఫిక్ అండ్ రోడ్‌సేఫ్టీ ఏడీజీపీగా బదిలీ చేశారు.

పరిషత్‌కు నలుగురి పేర్లు ఖరారు

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉండే నాలుగు స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారైనట్టు విశ్వసనీయ సమాచారం. సమాజసేవ, విద్య, సహకార రంగంలో సేవలందించి కేపీసీసీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న రమేశ్‌బాబు, జర్నలిస్టుల కోటాలో దినేశ్ అమీన్‌మట్టు, ప్రవాస భారతీయ సేవారంగం, మహిళా, సమాజసేవ కోటాలో డాక్టర్ ఆరతి కృష్ణ, దళిత సంఘర్ష సమితి రాష్ట్ర అధ్యక్షులు డీజీ సాగర్ పేరు ఖరారైనట్టు సమాచారం. రాజ్‌భవన్‌కు గవర్నర్ ఆమోదం కోసం పంపినట్లు తెలుస్తోంది. అధికారికంగా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.



తప్పు చేసిందెవరు.. శిక్ష ఎవరికి..?

- విధానసౌధ బెంగళూరులో లేదా..? ● అనధికార కార్యక్రమంలో సీఎం, డీసీఎం ఎలా పాల్గొంటారు?
- తక్షణమే పదవులకు రాజీనామా చేయాలి ● తొక్కిసలాటపై ప్రతిపక్షనేతల మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కుమారస్వామి

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్సీబీ సంబరాల్లో అభిమానుల మృతి ఘటనలో తప్పు చేసిందెవరు.. శిక్ష ఎవరికి అంటూ..? ప్రతిపక్షనేతలు ప్రభుత్వంపై మండిపడ్డారు. కేంద్రమంత్రి కుమారస్వామి, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి తదితరులు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆర్‌సీబీ ట్రోఫీ సాధించడంపై విజయోత్సవాలకు పిలుపునిచ్చి హడావుడిగా చేయాల్సిన అవసరం ఏముందని కేంద్రమంత్రి కుమారస్వామి ప్రశ్నించారు. తొక్కిసలాట సంఘటనలో ఏ1గా సీఎం, ఏ2గా డీసీఎం, ఏ3గా హోం మంత్రి పరమేశ్వర్‌లు ఉండాలని, నైతిక బాధ్యతతో వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మ్యాచ్ ముగిసేసరికే అర్ధరాత్రి జరిగిందని ఆ మరుసటి రోజే కిలోమీటరు దూరంలో రెండు సభలు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలోనే లేని విధంగా బెంగళూరు నగర పోలీస్ కమిషనర్‌ను సస్పెండ్ చేశారన్నారు. తొక్కిసలాటలో గాయపడినవారిని పోలీసులు భుజాన వేసుకుని, చేతులపై ఎత్తుకుని పరుగులు తీసి ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. అనధికార కార్యక్రమమని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. అనధికారమైనప్పుడు డీసీఎం ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. సీఎం ఇంటికి ఫ్రాంచైజీ వారిని తీసుకెళ్లింది ఎవరు, ఎందుకోసమని ప్రశ్నించారు? కమిషనర్ అనుమతులు ఇవ్వలేదని సీఎంకు చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఏం జరిగినా పర్వాలేదు... నేను ఉన్నానంటూ భరోసా ఇచ్చినవారు పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకుంటున్నారని నిలదీశారు. విధానసౌధ వద్ద గొడవ లేదని, స్టేడియం వద్దనే సమస్య అని సీఎం చెబుతున్నారని అదేం కర్ణాటకలో లేదా..? అంటూ ప్రశ్నించారు. ప్రమాదంపై పోలీసుల సస్పెన్షన్ కేవలం నాటకమని మండిపడ్డారు. నెలరోజుల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేస్తామని ముందుగానే చెప్పి ఉంటారని కేంద్రమంత్రి కుమారస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుశాఖ సలహాలను ధిక్కరించి సంబరం చేసి తప్పును మూసివేసేందుకు కమిషనర్‌తోపాటు పలువురిపై వేటు వేశారని ఆరోపించారు. ఇదే కమిషనర్ దయానంద్ ఉన్నప్పుడే కొత్త సంవత్సర వేడుకల్లో లక్షలాదిమంది పాల్గొన్నా చిన్న సంఘటన లేదన్నారు. రాష్ట్రప్రభుత్వం సీఐడీ, న్యాయ విచారణ, మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించామని చెబుతున్నారంటే ఈ సంస్థల ద్వారా న్యాయం జరగదని, వాస్తవాలు బయటకు రావన్నారు.

సర్కారుకు కళ్లు లేవు : బీజేపీ

ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ ఇదో కళ్లు లేని రాష్ట్రమని, అందుకు తగ్గట్టుగానే ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. సిద్దరామయ్య బ్యాట్స్‌మన్, డీకే శివకుమార్ బౌలర్ తరహాలో వ్యవహరించారని మండిపడ్డారు. కానీ ప్రజలకే ప్రమాదం జరిగిందన్నారు. సిట్టింగ్ లేదా మాజీ చీఫ్ జస్టిస్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీకే శివకుమార్ స్టేడియంకు వెళ్లి ట్రోఫీకి ముద్దుపెట్టి ఫోజులు ఎందుకు ఇచ్చారన్నారు.

క్రస్ట్‌గేట్ల నెపంతో కాలయాపన వద్దు

- తుంగభద్ర రైతులను అయోమయానికి గురి చేయకండి
- తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి కాలువలకు నీరు వదలాలి
- బళ్లారి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ గౌడ



సెక్రటరీ ఓఆర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి కొత్తగా ఏర్పాటుచేయనున్న క్రస్ట్‌గేట్ల నెపంతో ఆయకట్టు రైతులను ఆయోమయానికి గురి చేయవద్దని, తక్షణమే కాలువలకు నీరు వదిలాలని తుంగభద్ర రైతు సంఘం బళ్లారి జిల్లా అధ్యక్షుడు పురుషోత్తమ గౌడ బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డిని కోరారు. శుక్రవారం సెక్రటరీకి వినతిపత్రం అందజేసిన రైతు సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో ఇప్పటి వరకు కొత్తగా గేటు అమర్చలేదని, మిగిలిన 32 కొత్తగా క్రస్ట్‌గేట్లు అమర్చడం ఈ ఏడాది సాధ్యం కాదని అనిపిస్తోందన్నారు. ఇప్పటికే జలాశయానికి 22టీఎంసీల మేర వరద నీరు వచ్చి చేరిందని, గేట్ల భద్రతా దృష్ట్యా ఈ ఏడాది జలాశయంలో 80టీఎంసీల నీటిని పరిమితం చేసే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారని, అలా అయితే జలాశయంలో నీటి నిలువ తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ఆంధ్ర, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల జలవనరుల శాఖామంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జలాశయంలో 25 టీఎంసీల నీరు చేరిన వెంటనే కాలువలకు సాగు నీరు విడుల చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించక పోతే మూడు రాష్ట్రాల ప్రజలు పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. ఎస్ఈ నారాయణ నాయక్‌తో పాటు తుంగభద్ర రైతు సంఘం పదాధికారులు పాల్గొన్నారు



సిలికాన్ శిల్పం ఆవిష్కరణలో సాలుమరద తిమ్మక్క

వృక్షమాతకు సిలికాన్ శిల్పం

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వృక్షమాతగా పేరొందిన పద్మశ్రీ గ్రహీత సాలుమరద తిమ్మక్క సిలికాన్ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ఓరియన్ మాల్‌లో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాలుమరద తిమ్మక్క సిలికాన్ శిల్పాన్ని ఆవిష్కరించారు. ఆమె శిల్పాన్ని ఆమె ద్వారానే ఆవిష్కరింపచేశారు. పర్యావరణం కోసం ఆమె చేసిన విజయాలను కొనియాడుతూ ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు. పర్యావరణ రక్షణకు ఆమె చేసిన సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, మొక్కలు నాటి ఆమె ఆశయాన్ని బతికించాలన్నారు.



మిట్టహళ్ళి పాఠశాల విద్యార్థినికి పాఠాలు చెబుతున్న టీచర్ గంగాధర్

సింగిల్ టీచర్.. స్టూడెంట్..!

- సకల సౌకర్యాలున్నా విద్యార్థులు లేని దుస్థితి

ముళబాగిలు, జూన్6(ఆంధ్రజ్యోతి): సింగిల్ టీచర్ పాఠశాలలు పెరిగిపోవడంపై విద్యాశాఖ గగ్గోలు పెడుతోంది. సమీపంలోని పాఠశాలల్లోకి విలీనం చేసేందుకు స్థానికులు, ఉద్యమకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలా పలు చోట్ల వింత పరిణామాలు వెలుగులోకి వస్తున్నాయి. కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా మిట్టహళ్ళిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఒక విద్యార్థిని మాత్రమే ఉంది. ఈ విద్యార్థి కోసం ఓ ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 72 ఇళ్లు ఉండగా.. 436 మంది జనాభా ఉన్నారు. పదిమంది విద్యార్థులు ప్రాథమిక విద్యకోసం ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులు లేకుండా పోయారు. ఒక విద్యార్థి కోసమే మధ్యాహ్న భోజనం కూడా తయారు చేస్తున్నారు. పాఠశాలలో ఓ తరగతి గది, వంటగది, శౌచాలయం, తాగునీటి వ్యవస్థ, ఫర్నిచర్ అన్నీ ఉన్నాయి. కానీ పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివించాలని తల్లిదండ్రులు సమీపంలోని ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నారు. 43ఏళ్లక్రితం ఇక్కడ పాఠశాలను ప్రారంభించారు. ఇటీవల వరుసగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఒకే విద్యార్థిని ఉన్నట్లు ఉపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు. బీఈఓ రామచంద్ర అభిప్రాయం మేరకు ఇక్కడ పాఠశాలను మూసివేయాలనే ఆలోచన లేదని, వచ్చే ఏడాది అయినా పిల్లలు వస్తారని భావిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పాఠశాలను కాపాడుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అప్పుల ఉరికి వేలాడిన అన్నదాత


రామాంజనేయులు (ఫైల్)

కూడేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రకోడు గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు అప్పులబాధతో గురువారం రాత్రి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు రామాంజనేయులు తనకున్న ఐదెకరాల పొలంలో వేరుశనగ, మొక్కజొన్న, టమోటా పంటలు సాగు చేస్తుండేవాడు. అతివృష్టి, అనావృష్టితో పంటలు సాగుకు పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.6 లక్షలు అయ్యాయి. వాటిని చెల్లించే మార్గం కనిపించక ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రపోతుండగా రామాంజనేయలు మరో గదిలోకి వెళ్లి చీరతో ఉరేసున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. శవాన్ని కిందికి దించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను సేకరించారు. రైతు భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకి తరలించారు. రైతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ..

సోమందేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంబాబు కాలనీకి చెందిన ఈశ్వరమ్మ (47) జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరమ్మ భర్త నాగభూషణం చేనేత కార్మికుడు. వయోభారంతో పనిచేతకాక పింఛన్‌పై ఆధారపడి బతుకుతున్నారు. వీరికి సాయి నరసింహులు అనే కుమారుడున్నాడు. అతడు కొత్త కొట్టాలలో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. దంపతులు.. రోజూ కొడుకు వద్ద భోజనం చేసి రాత్రి ఇంటికి వచ్చి నిద్రించేవారు. శుక్రవారం ఎవరూలేని సమయంలో ఈశ్వరమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమె మానసిక స్థితి బాగోలేదని స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రస్తా విషయంలో దాడి

● నలుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు

యల్లనూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాగుండ్ల పంచాయతీలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో రస్తా విషయంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన వారాది వర్గీయులు దాడిచేశారు. ఈ దాడుల్లో నారాయణస్వామితోపాటు మరో నలుగురు గాయపడ్డారు. లింగారెడ్డిపల్లికి చెందిన నారాయణస్వామికి మల్లాగుండ్ల పొలంలో భూమి ఉంది. ఈ పొలానికి వెళ్లే రహదారి విషయంలో మల్లాగుండ్లకు చెందిన వారాది శుక్రవారం సాయంత్రం నారాయణస్వామితో గొడవపడ్డారు. ఈ గొడవ కాస్త పెద్దదై నారాయణస్వామి అన్నదమ్ములపై వారాది మరో ఏడుగురితో కలిసి కట్టెలతో దాడిచేశారు. ఈ దాడిలో రామాంజనేయులు, నారాయణస్వామి, రాజమల్లు, ఓబులేసులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. నారాయణస్వామి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులరెడ్డి తెలిపారు.

కొత్తిమీర పంటను కోసుకెళ్లిన దుండగులు


గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళ్లిన కొత్తిమీర పంట

చిలవత్తూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర పంటకు మార్కెట్లో ధర బాగా ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు అర ఎకరంలో పంటను గురువారం రాత్రి కోసుకెళ్లారు. మండలంలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన రైతు ఆదినారాయణప్ప తనకున్న అర ఎకరం పొలంలో కొత్తిమీర పంటను సాగు చేశాడు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను గుర్తుతెలియని వ్యక్తులు ఇలా రాత్రికి రాత్రే కోసుకెళ్లడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న పొలంలో ఇలా పంటను కోసుకెళ్లడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

మహిళ అదృశ్యం


సరస్వతి (ఫైల్)

కళ్యాణదుర్గం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రనేల వీధిలో నివాసం ఉంటున్న సరస్వతి అనే మహిళ ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల కాలనీల్లోను, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఎక్కడైనా కనిపిస్తే 7386400113, 9490106284 అనే నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బాల్య వివాహంపై కేసు

యాడికి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం జరిగిన బాల్యవివాహంపై అధికారులు కేసు నమోదు చేశారు. యాడికి మండలం ఈరన్నపల్లి గ్రామానికి చెందిన యువకుడికి, గుంతకల్లు రూరల్ మండలంలోని గ్రామానికి చెందిన బాలికకు శుక్రవారం వివాహం జరిపారు. దీనిపై చైల్డ్‌లైన్ నెంబరు 1098కు ఫిర్యాదు అందింది. 1098కాల్ సెంటర్ నుంచి స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, పోలీసు సిబ్బంది కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లే సమయానికే వివాహం జరిగిపోయింది. దీంతో వరుడితోపాటు బాలికను వారి తల్లిదండ్రులను, వివాహం జరిపించిన పెద్దలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలికను వారి తల్లిదండ్రులతో పంపించేశారు. బాల్యవివాహంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు కసాపురం ఆలయ భూముల వేలం

గుంతకల్లుటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన వజ్రకరూరు మండలంలోని వ్యవసాయ భూములను కౌలుకు చేసుకునేందుకు శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వాణి ప్రకటనలో తెలిపారు. సర్వే నంబరు 122లోని 1వ ప్లాటులో 14 ఎకరాలు, 2వ ప్లాటులో 13.62 ఎకరాల భూమిని మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. వజ్రకరూరులోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు వేలంపాట ఉంటుందన్నారు.

ఆవుకు ఒకే ఈతలో రెండు దూడలు

తనకల్లు, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి గ్రామంలో సూర్యనారాయణరెడ్డికి చెందిన జెర్సీ ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. ఆవు ప్రసవించడానికి(ఈనడానికి) ఇబ్బంది పడుతుండగా పశువుల వైద్య సహాయకుడు సుధాకర్‌నాయక్‌ను పిలిపించారు. ఆయన ఆవును పరిశీలించి, ఒక దూడ అడ్డం తిరిగినట్లు గుర్తించారు. తన చేతులతో చాకచక్యంగా ఆ దూడను బయటకు తీశాడు. మరో దూడను సాధారణంగానే ప్రసవించింది. రెండూ ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు.



ఆర్డీటీ సేవలు ఆగవు

మంత్రి నారా లోకేశ్ అభయం

● కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

● త్వరలో ఫలించే అవకాశం



అనంతపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమతోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గ్రామీణుల అభివృద్ధి కోసం పని చేస్తున్న ఆర్డీటీ సేవలు నిరంతరంగా కొనసాగేందుకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారాలోకేశ్ కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతోనూ, సంబంధిత ఉన్నతాధికారులు, సంస్థలతోనూ సంప్రదింపులు సాగిస్తున్నారు. విద్య, వైద్యం, విజ్ఞానం, ఉపాధి, వికాస రంగాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు మంత్రి లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కివస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాల ద్వారా అందిన సమాచారం. త్వరలోనే ఆర్డీటీ సేవలు, కార్యకలాపాలు యథావిధిగా సాగే అవకాశం ఉందని ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆర్డీటీకి విదేశాల నుంచి నిధుల వినియోగాన్ని ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద కేంద్రం నిలిపివేసింది. దీంతో ఆ నిధులను ఆర్డీటీ వినియోగించేందుకు వీలులేకుండా పోయిన విషయం తెలిసిందే. లోకల్ కాంట్రిబ్యూషన్ ఖాతాలోని నిధులనే సేవా కార్యక్రమాలకు వాడాల్సి వస్తోంది. ఫలితంగా అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఆర్డీటీ చేపడుతున్న విద్య, వైద్యం, స్వయం ఉపాధి కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందనేది నిర్వివాదాంశం. ఉమ్మడి అనంత జిల్లాలో సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. యువగళం పాదయాత్ర సమయంలో ఆర్డీటీ సేవా కార్యక్రమాలను నారా లోకేశ్ ప్రత్యక్షంగా చూసిన విషయం తెలిసిందే. ఆర్డీటీ కార్యాలయాన్ని సంప్రదించడంతోపాటు సంస్థ నిర్వాహకులు అన్నె ఫెర్రర్, మాంచో ఫెర్రర్‌తో మాట్లాడారు. ప్రభుత్వంతో సమాంతర ంగా విద్య, వైద్యం, ఉపాధి రంగాల ద్వారా పేదలకు ఆర్డీటీ అందిస్తున్న నిస్వార్థ సేవలను ఆయన ప్రత్యక్షంగా చూసిన నేపథ్యంలో... తాము అధికారంలోకి వచ్చాక ఆర్డీటీ సేవలు విస్తరించేందుకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆర్డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్.. మంత్రి నారా లోకేశ్‌ను కలవడం, పరిస్థితిని వివరించిన విషయం తెలిసిందే. సంస్థ ద్వారా సేవలు మరింత విస్తరించేందుకు సహకారం ఇవ్వాలని కోరగా.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తామని లోకేశ్ భరోసా ఇచ్చిన విషయం విదితమే. ఆర్డీటీ నిర్వహిస్తున్న ఆస్పత్రుల నుంచి వస్తున్న ఆదాయాన్ని ఎఫ్‌సీ ఖాతాలో కాకుండా ఎల్‌సీ ఖాతాలో జమ చేశారనే అభియోగంపై కేంద్రం ఎఫ్‌సీఆర్‌ఏ వినియోగానికి అనుమతులు నిరాకరించింది. ఆర్డీటీకి వస్తున్న నిధులను ఇతర ఎన్జీఓలు చేపట్టే కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారనే ఆరోపణలతో ఆంక్షలు విధించడంతో ఆర్డీటీ సేవలు ప్రశ్నార్థకమయ్యాయి. రాయలసీమ, తెలంగాణ రాష్ట్రంలోని 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు అందిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600కిపైగా పడకలతో మూడు ఆస్పత్రులను ఆర్డీటీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏటా లక్షలాది మంది అవుట్ పేషెంట్లు, వేలాదిమంది ఇన్‌పేషెంట్లకు సేవలు అందిస్తోంది. కరోనా సమయంలోనూ బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిని కొవిడ్ సెంటర్‌గా మార్చు చేసి 10వేల మందికి చికిత్స అందించారు. మూగ, చెవిటి, మానసిక దివ్యాంగ విద్యార్థులకు పాఠశాలలు నిర్వహిస్తోంది. కేంద్రం ఆంక్షలతో ప్రస్తుతం ఆ సేవలన్నీ నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. కష్టకాలంలో ఉన్న ఆర్డీటీని ఆదుకోవడమేకాకుండా ఆ సంస్థ ద్వారా సేవలను మరింత విస్తృతపర్చడంలో భాగంగా మంత్రి నారాలోకేశ్ ఆ సంస్థకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆర్డీటీ సేవలకు ఎదురైన అడ్డంకులన్నీ తొలగిపోయి, మళ్లీ యథావిధిగా కొనసాగేలా మంత్రి నారాలోకేశ్ చేస్తున్న కృషి ఫలించనుందని ప్రభుత్వ పెద్దల ద్వారా అందిన సమాచారం.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

● పదవులకు వన్నెతెచ్చేలా పనిచేయాలి

● ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత

● అట్టహాసంగా రాప్తాడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకారం చేస్తున్న బోయపాటి సుధాకర్‌చౌదరి

అనంతపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు దక్కుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో రాప్తాడు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం అట్టహాసంగా సాగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. ముందుగా కక్కలపల్లి క్రాస్ నుంచి ముఖ్య అతిథులతో పాటు మార్కెట్ యార్డు పాలక వర్గసభ్యులు ర్యాలీగా వచ్చారు. టీడీపీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికాయి. మార్కెట్ కార్యదర్శి రాంప్రసాద్ యార్డు చైర్మన్‌గా సుధాకర్ చౌదరి, వైస్ చైర్మన్‌గా గంగులకుంట క్రిష్టతోపాటు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర పాలనను అస్తవ్యస్తం చేసిందన్నారు. అప్పులతో అవస్థల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు తన పాలనా దక్షతతో గాడిలో పెడుతున్నారన్నారు. రాప్తాడు మార్కెట్ యార్డు పరిపాలన భవన నిర్మాణానికి రూ.25లక్షల ఎంపీ నిధులు కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో స్థానం దక్కిన ప్రతి ఒక్కరూ ఆ పదవులకు వన్నెతేచ్చేవిధంగా పనిచేయాలన్నారు. గతంలో ఎక్కువమంది పోటీ ఉండటం వలన చివరి వరకు కమిటీ ఏర్పాటు కాలేదన్నారు. చివర్లో పదవులు ఇచ్చినా సమయం తక్కువగా ఉండటం వలన సరిగా పని చేయలేకపోయారన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించి రైతులకు ఏమికావాలన్నది తమ దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా వాటిని ఎంపీ సాయంతో ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విస్తృతంగా పంట సాగు ఉందని అయితే ఎంత ఖర్చు పెట్టి పంటలు సాగుచేసినా సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారన్నారు ఇలాంటి సమయంలో మార్కెట్ కమిటీ సభ్యులు చొరవతీసుకుని రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు జగన్‌ని గద్దె దించేందుకు ఏవిధంగా పోరాటం చేశారో ఇప్పుడు రైతుల కోసం అదే తరహాలో పనిచేయాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు సేవచేయడానికి తనకు అవకాశం దక్కిందన్నారు. ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో రైతులకు అన్నివిధాల న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను గజమాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో నిధుల దుర్వినియోగాన్ని సహించం..

● కరోనా జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించండి

● రైతులకు విత్తనాలు సకాలంలో అందించండి

● జడ్పీ స్టాండింగ్ కమిటీ భేటీలో చైర్‌పర్సన్, సభ్యులు


పీడీపై అసహనం వ్యక్తంచేస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

అనంతపురం విద్య, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్)లో నిధుల దుర్వినియోగాన్ని సహించబోమని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జడ్పీటీసీలు హెచ్చరించారు. స్థానిక జడ్పీలో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమాశాలు నిర్వహించారు. వ్యవసాయం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, వైద్యం అంశాలపై చర్చ జరిగింది. వర్షాలు పడుతున్నాయనీ, రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని సభ్యులు.. అధికారులను కోరారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఐఎస్ఓ ప్రమాణాల కోసం ఆధునికీకరిస్తే... దానిని వెంటనే తొలగించడం సరికాదన్నారు. దీంతో నిధులు దుర్వినియోగమయ్యాయంటూ జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీ జయరాం.. ఐసీడీఎస్ పీడీపై అసహనం వ్యక్తం చేశారు. పోషణ్ పక్వాడా నిధుల్లో సైతం గోల్‌మాల్ జరిగిందంటూ మండిపడ్డారు. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం లేదనీ, కరోనా వ్యాప్తి నేపథ్యంలో పిల్లలు అనారోగ్యం బారినపడకుండా చూడాలని ఆదేశించారు. రాయదుర్గం, గోరంట్ల, గుమ్మఘట్ట జడ్పీటీసీలు మాట్లాడుతూ.. కరోనా వ్యాప్తిపై ప్రజల్లో అవగాహన పెంచాలంటూ డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. మండలాలకు శానిటైజర్, మాస్కులు పంపిణీ చేయాలన్నారు. విలేజ్ క్లినిక్‌లను ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వైస్ చైర్‌పర్సన్ నాగరత్న, జడ్పీటీసీలు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు బక్రీద్

● ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

● కొండెక్కిన పొట్టేళ్ల ధరలు

అనంతపురం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లింల ప్రధాన పండుగల్లో బక్రీద్ ఒకటి. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను శనివారం చేసుకోనున్నారు. రంజాన్ పర్వదినం ముగిసిన 70 రోజుల తర్వాత ముస్లింలు బక్రీద్ జరుపుకోవడం ఆనవాయితీ. బక్రీద్ పండుగకు ముందురోజునే ముస్లింలు మరణించిన తమ వారి సమాధుల వద్ద వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాలను ఉంచుతారు. వారు స్వర్గం నుంచే వాటిని స్వీకరిస్తారని విశ్వాసం. పండుగ నేపథ్యంలో ధనికులైన ముస్లింలు పొట్టేలు మాంసాన్ని పేదలకు కుర్బానీ పేరుతో వితరణ చేయడం ఆనవాయితీ. రంజాన్ పండుగలాగానే బక్రీద్ నాడు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ నేపథ్యంలో శనివారం నిర్వహించే సామూహిక ప్రార్థనలకోసం జిల్లాలోని ఈద్గాలు, మసీదులు సిద్ధమయ్యాయి. కాగా ప్రాంతాలవారీగా మసీదుల్లో 6.30 గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభమవుతాయి. హెచ్చెల్సీ కాలనీ ఈద్గాలో 9 గంటలకు, హౌసింగ్‌బోర్డులో 9.30కి ప్రార్థనలు నిర్వహించనున్నట్లు మతపెద్దలు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో వజూ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కొండెక్కిన పొట్టేళ్ల ధరలు

బక్రీద్‌ను పురస్కరించుకుని వారం రోజుల ముందు నుంచే పొట్టేళ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఒక్కో పొట్టేలు రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలికాయి. బక్రీద్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని చాలామంది పొట్టేళ్లను ప్రత్యేకంగా పెంచి విక్రయిస్తుంటారు. శుక్రవారం అనంతపురం నగరంలోని నడిమివంక వద్ద పొట్టేళ్ల విక్రయాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పొట్టేళ్లను తీసుకువచ్చి విక్రయించారు. దీంతో పొట్టేళ్ల ధరలు కొండెక్కాయి. సాధారణ రోజుల్లో 15 కిలోల బరువు ఉండే పొట్టేలు ధర రూ.12వేలు ఉండగా.. బక్రీద్ డిమాండ్ నేపథ్యంలో అది రూ.20వేలకు చేరుకుంది. పండుగకు కుర్బానీ సంప్రదాయం కావడంతో ధర ఎక్కువైనా ముస్లింలు పొట్టేళ్లను కొని తీసుకెళ్లడం కనిపించింది.

నడిమివంక వద్ద పొట్టేళ్ల విక్రయాలు


అన్నింటికీ అపార్ అవసరం

● జేఎన్‌టీయూ డీఈ నాగప్రసాద్ నాయుడు


అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

అనంతపురం సెంట్రల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ అపార్ నమోదు చేసుకోవాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ) ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు సూచించారు. అపార్ ఐడీ రూపకల్పపై వర్సిటీలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.. ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ ఉపయోగపడుతుందన్నారు. ఎల్‌కేజీ నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు సర్టిఫికెట్లన్నింటినీ అపార్‌లో భద్రపరచుకోవచ్చన్నారు. హెచ్‌టీటీపీఎస్://ఏపీఏఏఆర్.ఈడీయూసీఏటీఐఓఎన్.జీఓవీ.ఇన్/ వెబసైట్‌లోగానీ ప్లేస్టోర్‌లో అపార్ యాప్‌ద్వారాగానీ విద్యార్థులు ఆధార్ నంబరుతో ఐడీని క్రియేట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్, కుల, ఆధాయ ధృవీకరణ తదితర పత్రాలు అపార్‌లో పొందుపరచుకోవచ్చన్నారు. ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఎక్కడికెళ్లినా అపార్‌లోని సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని వివరించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలన్నీ విద్యార్థులతో తప్పకుండా అపార్ ఐడీలను క్రియేట్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ ఇండియా కార్పొరేషన్ రీజనల్ కోఆర్డినేటర్ రవి పాండ్యన్, ఉన్నత విద్యామండలి అధికారులు అనిల్‌కుమార్, రాజేందర్, జేఎన్‌టీయూ పరీక్షల నిర్వహణ విభాగాధికారులు ప్రొఫెసర్ శివకుమార్, శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

సీడీపీఓల బదిలీ

అనంతపురం విద్య, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు సీడీపీవోలు, అడిషనల్ సీడీపీఓలు బదిలీ అయ్యారు. ఈమేరకు ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుడిబండ సీడీపీఓగా పనిచేస్తున్న పద్మావతిని రాయదుర్గం సీడీపీఓగా బదిలీ చేశారు. సోమందేపల్లి సీడీపీఓ అనురాధమ్మను అనంతపురం అర్బన్ సీడీపీఓగా వేశారు. గుత్తిలో అడిషనల్ సీడీపీఓగా పనిచేస్తున్న నాగమణిని కణేకల్లు సీడీపీవోగా బదిలీ చేశారు. శింగనమల సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అనంతపురం రూరల్ ప్రాజక్టు సీడీపీఓగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి సీడీపీఓ పద్మావతిని కంబదూరు సీడీపీవోగా బదిలీల చేశారు. అనంతపురం సీడీపీవో లలితమ్మను శింగనమల సీడీపీవోగా నియమించారు. అనంతపురం రూరల్ సీడీపీవోగా పనిచేస్తున్న ధనలక్ష్మమ్మను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సీడీపీవోగా బదిలీ చేశారు.

ఒకచోట పాజిటివ్... మరో చోట నెగిటివ్

● గర్భిణికి కరోనా విషయంలో విరుద్ధమైన రిపోర్టులు

అనంతపురం టౌన్, జూన్ 6(ఆంధరజ్యోతి): జిల్లాలో మరో గర్భిణికి కరోనా సోకినట్లు ఓ ఆస్పత్రిలో, సోకలేదని మరో ఆస్పత్రిలో తేలింది. వైద్యవర్గాల సమాచారం మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన 25ఏళ్ల గర్భిణి అక్కడి ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లకు అనుమానం రావడంతో కరోనా పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆమెను అనంత జిల్లా సర్వజన ఆస్పత్రికి పంపించారు. ఇక్కడ మళ్లీ ఆగర్భిణీకి శాంపిల్స్ తీసి కరోనా పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో కొత్తగా కరోనా కేసులు నమోదుకాలేదని చెప్పుకొచ్చారు.

వీడియో చూపించి..బెదిరించి..!

● బాలిక జీవితంతో ఆడుకున్న మృగాళ్లు

రామగిరి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏమీ తెలియని వయసు. చనువుగా ఉంటూ మొదట ఒకరు లోబరుచుకున్నారు. లైంగిక దాడి చేశారు. ఆ దృశ్యాలను మరో యువకుడు తన సెల్‌ఫోన్‌లో బంధించాడు. వాటిని ఇతరులకు షేర్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. ఆ వీడియోలు చూపించి, బెదిరించి.. ఒక్కొక్కరుగా బాలికపై లైంగిక దాడికి తెగబడ్డారు. సుమారు ఏడు నెలల నుంచి ఈ దారుణాలు కొనసాగాయి. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. బాలికపై ఏకంగా 13 మంది లైంగిక దాడి చేశారని, మరో ఇద్దరు సహకరించారని ప్రాథమికంగా నిర్ధారించారు. వీరిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఎనిమిది మంది కోసం గాలిస్తున్నారు.

మూడేళ్ల క్రితం మొదలు..

బాధిత బాలిక ఏడో తరగతిలో ఉండగా దళిత సామాజికవర్గానికే చెందిన ఓ యువకుడు స్నేహంగా ఉండేవాడు. పసితనంలో వారిద్దరూ చనువుగా ఉన్న దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించిన మరో యువకుడు.. అప్పటి నుంచి బ్లాక్‌మెయిల్ ప్రారంభించినట్లు సమాచారం. ఆ వీడియోలను చూపించి, బెదిరించి లొంగదీసుకున్నట్లు తెలిసింది. గడిచిన ఐదు నెలల నుంచి ఆ ఊరి యువకుల్లో కొందరు బరితెగించి వ్యవహరించారని సమాచారం. ఒకరిని చూసి ఒకరు ఆ బాలికను బెదిరిస్తూ లైంగిక దాడికి పాల్పడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఆ అమ్మాయితో ఎక్కువ చనువుగా ఉండే దళిత యువకుడు కూడా అఘాయిత్యం చేశాడు. బాలికకు గర్భం రావడంతో ఆందోళన చెందిన ఆమె తల్లి, తన కూతురును పెళ్లి చేసుకోవాలని దళిత యువకుడిని ప్రాధేయపడింది. ఆ యువకుడు పెళ్లికి ఒప్పుకోలేదు. తనకు సంబంధం లేదని తేలిపోయాడు. పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తే తాను ఊరు విడిచి ఎక్కడికైనా వెళ్లిపోతానని బెదిరించాడు. దీంతో ఆమె గ్రామంలో కొందరిని కలిసి, జరిగిన సంఘటన గురించి వివరించింది. తన కూతురు జీవితాన్ని కాపాడాలని వేడుకుంది. స్పందించిన గ్రామస్థులు కొందరు.. బాలికను పెళ్లి చేసుకోవాలని దళిత యువకుడిని బలవంతం చేశారు. దీంతో ఆ యువకుడు ఎవరికి చెప్పకుండా ఊరు విడిచివెళ్లిపోయాడు. నెలరోజులుగా ఈ తతంగం కొనసాగుతోంది.

రెండు పార్టీల వారి పాత్ర

బాలికపై అఘాయిత్యానికి పాల్పడినవారిలో రెండు ప్రధాన పార్టీవారి పాత్ర ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ దారుణానికి పార్టీలతో సంబంధం లేకపోయినా, నిందితులు రెండు పార్టీలవారు కావడం చర్చనీయాంశమైంది. దళిత యువకుడు గ్రామం వదలివెళ్లడంతో ఈ సంఘటన బయటపడింది. దీంతో పోలీసులు శుక్రవారం బాధిత బాలికను, ఆమె తల్లిని కలిసి, పూర్తి సమాచారాన్ని సేకరించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు, అబిషేక్ అనే యువకుడు ఈ దారుణంలో కీలక పాత్ర పోషించాడు. తన మిత్రులతో కలిసి బాలికను టార్గెట్ చేశాడు. ఇప్పటి వరకూ 13 మందిని గుర్తించి కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు సహకరించారని, వారిపై కూడా కేసు నమోదు చేశారని సమాచారం. ఈ సంఘటనపై ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, రామగిరి సీఐ శ్రీధర్ లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్పష్టత వస్తుందని పోలీసులు అంటున్నారు.

బాలిక విషయంలోనూ నీచ రాజకీయాలా..?

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

అనంతపురం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఇప్పటి దాకా శవాలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేశారని, ఇప్పుడు అమాయకమైన బాలిక విషయంలోనూ వికృత రాజకీయాలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కర్ణాటక సరిహద్దులోని ఒక గ్రామంలో బాలికపై అఘాయిత్యం చేసిన ఘటనలో టీడీపీ నేతలు ఉన్నారని, వారిని తాను వేనకేసుకొస్తున్నానని వైసీపీ కర పత్రికలో ప్రచురించడం సిగ్గుచేటని అన్నారు. ఎవరి ప్రోద్బలంతో ఇలాంటి వార్తలు రాస్తున్నారు..? కనీసం వివరణ తీసుకునే పద్ధతి లేదా అని ప్రశ్నించారు. ఈ ఘటన గురించి తనకు తెలిసిన వెంటనే పార్టీ, కులం, మతం చూడకుండా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించానని తెలిపారు. బాలికపట్ల ఇంత దారుణంగా వ్యవహరించిన వారిని ఎవరైనా వెనకేసుకొస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి సంస్కార హీనమైన ఆరోపణలు ప్రచురించడం మానుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం ఈ కేసులో నలుగురిని అరెస్టు చేస్తే.. అందులో ఇద్దరు వైసీపీవారు ఉన్నారని, దీనికేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మనుషుల చావులతో ఎలాగూ రాజకీయాలు చేస్తున్నారని, కనీసం బాలికలు, మహిళలను వాడుకోకుండా ఉండాలని సూచించారు. ఈ ఘటనను ఎస్పీ సీరియస్‌గా తీసుకుని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గడాఫి (జయంతి)



లిబియా దేశ ఉద్యమ నాయకుడు ముమ్మర్ ముహమ్మద్ అబు మిన్యార్ అల్-గడాఫి 1942 జూన్ 7న జన్మించారు. కల్నల్ గడాఫిగా పేరొందారు. రాజకీయ నేత, సిద్ధాంతకర్త. లిబియాన్ అరబ్ రిపబ్లిక్‌కు 1969 నుంచి 1977వరకు ఛైర్మన్‌గా కొనసాగారు. 'గ్రేట్ సోషలిస్టు పీపుల్స్ లిబియాన్ అరబ్ జమాహిరియా'కు 'బ్రదర్లీ లీడర్'గా 1977 నుంచి 2011 వరకు కొనసాగారు. నాలుగు దశాబ్దాల పాటు లిబియా రాజకీయాలను శాసించి పాలనలో సంస్కరణలతో ప్రజాదరణ పొందారు. 2011 అక్టోబరు 20న కన్నుమూశారు.

ప్రిన్స్ రోజర్స్ నెల్సన్ (జయంతి)



అమెరికాకు చెందిన సంగీత దర్శకుడు ప్రిన్స్‌గా పేరొందిన ప్రిన్స్ రోజర్స్ నీల్సన్ 1958 జూన్ 7న జన్మించారు. గాయకుడు, గేయ రచయిత, మల్టి ఇన్ స్ట్రుమెంటలిస్ట్, రికార్డ్ ప్రొడ్యూసర్, నటుడు, డైరెక్టర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రపంచ వ్యాప్తంగా ఫంక్, ఆర్ అండ్ బి, రాక్, న్యూవేవ్, క్లాజికల్, సోల్, సింత్-పాప్, పాప్, జాజ్, హిప్‌హాప్ వంటి సంగీతంలో ఎంతో పేరొందారు. ప్రపంచ వ్యాప్తంగా 150 మిలియన్‌లకుపైగా రికార్డులు అమ్ముడయ్యాయి. గ్రామీ ప్రెసిడెంట్స్ మెరిట్ అవార్డు, అకాడమీ అవార్డు, అమెరికన్ మ్యూజిక్ అవార్డ్ ఫర్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులు పొందారు. 2016 ఏప్రిల్ 21న కన్నుమూశారు.

మహేశ్ భూపతి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత మహేశ్ శ్రీనివాస్ భూపతి 1974 జూన్ 7న చెన్నైలో జన్మించారు. టెన్నిస్‌లో గ్రాండ్ స్లామ్ గెలుపొందిన తొలి భారతీయుడిగాను, వరల్డ్ నెంబరు వన్‌గా నిలిచారు. 2006లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో విజయం సాధించడంతో 'ఎలైట్ గ్రూప్ ఆఫ్ 8 టెన్నిస్‌ప్లేయర్స్'లో చేరారు. లియాండర్ పేస్‌తో కలసి డబుల్స్‌లో పలు విజయాలు అందుకున్నారు. 'ఇంటర్నేషనల్ ప్రీమియర్ టెన్నిస్ లీగ్' సంస్థాపకులలో ఒకరు. 2016లో నాన్‌ప్లేయింగ్ డేవిస్ కప్ కేప్టెన్‌గా వ్యవహరించారు. టెన్నిస్ అభివృద్ధికి పలు చర్యలు చేపట్టి పలువురు క్రీడాకారులను ప్రోత్సహించారు.

ఉమా మహేశ్వరుడిని దర్శించుకున్న మంత్రి



పూజల్లో పాల్గొన్న మంత్రి సవిత

సోమందేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలకూరు గ్రామంలో వెలసిన ఉమా మహేశ్వరుడిని మంత్రి సవిత శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా స్వామివారికి పూజలు చేయించారు. ఆలయ నిర్మాణకర్త తంబి వేణుగోపాల్, కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. చాలకూరు మాజీ సర్పంచ్ భానుకీర్తి మాట్లాడుతూ 2003లో తంబి వేణుగోపాల్ ఆలయ నిర్మాణం చేపట్టారన్నారు. వందేళ్ల క్రితం ఆయన పూర్వీకులు గ్రామాన్ని వదిలి బెంగళూరులో స్థిరపడ్డారన్నారు. అయినా స్వగ్రామంపై ఉన్న మమకారంతో ఆయన ఆలయ జీర్ణోద్ధరణ గావించి 23సంవత్సరాల అనంతరం అత్యంత వైభవంగా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ డబ్బు లు అందరూ సంపాదిస్తారుకానీ సేవా కార్యక్రమాలు కొందరే చేస్తారన్నారు. ఆలయంలో మూడు రోజులపాటు కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం వేద పారాయణం, యాగశాల ప్రవేశం, గణపతి, గంగపూజ, స్వస్తివాచన, దేవనాంది, మాతృక పూజ, పంచగవ్య స్థాపన, రక్షాబంధన, అంకురార్పణ, మహామంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం గావించారు. శోభాయమానంగా అలంకరించిన ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. టీడీపీ నాయకులు నీరుగంటి చం ద్ర, డివి ఆజనేయులు, కన్వీనర్ వెంకటేశు, వెంకటరాముడు, రామక్రిష్ణ, సిద్దలింగప్ప, వడ్డె సూరీ, కిష్టప్ప, చిన్నబాబయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ఏర్పాటు చేయండి



పీఎస్ పాళెం గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

గుడిబండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.ఎస్ పాళెం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని పదేళ్లు గడిచినా ఇంత వరకు సీసీ రోడ్లు వేయకపోవడంతో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో ఇంటి ముందు ఉన్న గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయని వాపోతున్నారు. దీంతో దోమలు వృద్ధిచెంది వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కాలనీకి సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

ఏఐ అనుసంధానంలో భారత్ వెనకడుగు

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు (ఏఐ) అనుసంధానంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పాదనా రంగంలో కేవలం 15శాతం మాత్రమే వినియోగిస్తున్నాయని బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ (బీసీఐసీ) నివేదికలో ప్రకటించింది. బీసీఐసీ, ఆర్‌వీ కాలేజ్‌లు 'ఉత్పాదనా రంగంలో ఏఐ' అనే ప్రత్యేకమైన నివేదికను విడుదల చేశారు. మిత్సుబిషి ఎలక్ట్రికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సీఏసీ సిస్టమ్స్ చీఫ్ కెంజి అంజయ మాట్లాడుతూ ఏఐ కేవలం సాంకేతిక ప్రగతికి మాత్రమే కాదని, ఉత్పాదనా రంగంలోనూ అనుసంధానం చేసుకోవచ్చునన్నారు. డిజిటల్ ప్రపంచంలో డేటా విస్తరణ, నెట్‌వర్క్ వ్యవస్థను రక్షించేందుకు సైబర్ సెక్యూరిటీ ఉత్పత్తులు కీలకమన్నారు. ఏస్ మ్యాక్రోమ్యాటిక్ ఎండీ చంద్రశేఖర భారతి మాట్లాడుతూ ఏఐ వేగవంతంగా పరిశ్రమలలో మార్పుకు కారణమవుతోందన్నారు. ఉత్పాదనా రంగంలోనూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీసీఐసీ ఛైర్మన్ జీ ప్రకాశ్ మాట్లాడుతూ దేశంలో విస్తారమైన ఉత్పాదనారంగం కలిగి ఉందని, 90శాతం పరిశ్రమలు ఎంఎస్ఎంఈ వర్గానికి చెందినవన్నారు. దేశ జీడీపీలో 30శాతం సాధిస్తున్నాయన్నారు. 110 మిలియన్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయని, ఎగుమతులలో 48శాతం సాధ్యం చేస్తోందన్నారు. కానీ ఏఐను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేదన్నారు. బీసీఐసీ ప్రెసిడెంట్ వినీత్‌వర్మ, ప్రశాంత్‌గోఖలె తదితరులు మాట్లాడారు.



చర్చాగోష్ఠిలో పాల్గొన్న ప్రముఖులు

గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటన



వర్షపీడిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంజుల తదితరులు

మహదేవపుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామీణ ప్రాంతాలలో ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న ప్రదేశాలను ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి పర్యటించారు. మాజీ మంత్రి అరవింద లింబావళి, వివిధశాఖల అధికారులతో కలసి శుక్రవారం పరిశీలన చేశారు. కణ్ణూరు - బాగలూరు రోడ్డులోని గ్యాస్‌పైప్, నీటి పైప్ సహా ఆయా మార్గాల్లో వెళ్లే ఇతర పైప్‌లైన్‌లను ఒకటిన్నర అడుగు లోపల అమర్చాలని అధికారులకు సూచించారు. కిత్తగనూరు - బిదరహళ్ళి రోడ్డులోని బ్రిడ్జి ప్రాంతాన్ని, వర్షం కారణంగా దెబ్బతిన్న ఇతర ప్రదేశాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలోని రాజకాలువ పూడికతో నిండి ఉందని, వెంటనే పూడిక తీయాలని అధికారులకు సూచించారు. కాగా సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. కిత్తగనూరు - బిదరహళ్ళి కాలువ, రోడ్డు దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పణత్తూరు రైల్వే ఫ్లై ఓవర్ వద్ద గుంజూరుకు వెళ్లే రైలు మార్గానికి సమాంతరం రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని బీబీఎంపీ రోడ్డు కార్యనిర్వాహక ఇంజనీర్‌కు సూచించారు. వర్షపునీటి కాలువ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఎస్‌టీపీ పైప్‌లైన్ పనులను వేగిరం చేసి త్వరగా పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. బళగెరె రోడ్డుకు అనుబంధంగా దిశా అపార్ట్‌మెంట్ వద్ద వర్షపునీరు సజావుగా వెళ్లేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. గుంజూరు మెయిన్‌రోడ్డుకు 150 అడుగుల రోడ్డుకు వెళ్లే జంక్షన్ కేఆర్‌డీసీఎల్ రోడ్డు, డ్రైనేజీ పనులకు అవసరమైన భూస్వాధీనానికి సంబంధించి కొంతమంది భూయజమానులతో చర్చించి సానుకూలం చేయాలన్నారు. ఇలా పలు ప్రాంతాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ అధ్యక్షుడు హెచ్‌ఎస్ పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, బీఎస్ నటరాజ్, కణ్ణూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడు అశోక్, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ ఆరోగ్య విపత్తు నిర్వహణ అధ్యక్షుడు ఎస్ మారప్ప, స్థానిక ప్రముఖులు ఎల్ రాజేశ్, మోది, సత్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సమాజసేవ స్ఫూర్తిదాయకం

బంగారపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం లభించడం అంత సులభం కాదని, ఉద్యోగం లభించిన తర్వాత అందుకు తగిన న్యాయం కల్పించడంతోపాటు సమాజానికి దారిదీపంగా ఉండాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు సీ అప్పయ్యగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బాలికల పీయూ కళాశాలలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో కాలేజ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటాచలపతి రిటైర్డు అయిన నేపథ్యంలో మిత్రులబృందం ఆధ్వర్యంలో ఆత్మీయంగా వీడ్కోలుపలికి సత్కరించారు. అప్పయ్యగౌడ మాట్లాడుతూ వెంకటాచలపతి ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా కేజీఎఫ్, బంగారపేట తాలూకాలలో ఉత్తమసేవలందించి అపారమైన శిష్యబృందాన్ని కలిగి ఉన్నారన్నారు. క్రమశిక్షణతోపాటు గుణాత్మక విద్య అందించి విద్యార్థులను ఉత్తమ సంస్కారవంతులుగా తీర్చారన్నారు. వెంకటాచలపతి వృత్తితోపాటు ప్రవృత్తిగా సమాజసేవలో రాణించారని కొనియాడారు. ఆయన సమాజ సేవాస్ఫూర్తి ఇతరులకు ఆదర్శప్రాయమన్నారు. తాలూకా కసాప అధ్యక్షుడు ఆర్ అశ్వథ్, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ నాగానంద కెంపరాజ్, ఎల్ రామకృష్ణ, అధ్యాపకులు బోడరెడ్డి, వెంకటసుబ్బయ్య, పురసభ సభ్యుడు సునిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డు అధ్యాపకుడికి ఆత్మీయ సత్కారం

తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు చేయాలి



మీడియాతో సీకల్ రామచంద్రగౌడ తదితరులు

శిడ్లఘట్ట, 6 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీబీ విజయోత్సవ సంబరం వేళ చోటు చేసుకున్న తొక్కిసలాట సంఘటనపై దర్యాప్తు చేయాలని, శాఖ తరపున మృతుల కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. శుక్రవారం బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ మీడియాతో మాట్లాడుతూ తొక్కిసలాటలో 11మంది మృత్యువాత చెందడం విచారకరమన్నారు, సదరు సంఘటనకు సంబంధించి న్యాయ దర్యాప్తు జరిపించాలని, మృతులకు డిమాండ్ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు దుఃఖాన్ని భరించే శక్తి దేవుడు కల్పించాలని కోరారు. మృతుల కుటుంబాలకు తలా ఒక కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. సమావేశంలో రేష్మ సంజీవప్ప, పురుషోత్తమ, రామకృష్ణప్ప, తలదుమ్మనహళ్ళి మధు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై జాగృతి పెరగాలి

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత తరుణంలో పర్యావరణ సంరక్షణపై మరింత జాగృతి పెరగాల్సి ఉందని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుంకదకట్టెలోని అంజలి కాన్వెంట్ అండ్ నైటింగేల్ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి ఎంఎస్ సరళ మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణేగౌడ మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవ ప్రాధాన్యతను చిన్నారులకు వివరించారు. విద్యార్థులు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకం తగ్గాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 2 కిలోమీటర్లపాటు ర్యాలీ నిర్వహించి జాగృతి కల్పించారు. పర్యావరణ ఆవశ్యకతను తెలిపే ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్‌సీలో రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు సాధించిన మంజునాథను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.



ప్లకార్డులతో విద్యార్థులు

మంత్రివర్గ సమావేశంపై సన్నాహకసభ



సమావేశంలో జిల్లా అధికారి రవీంద్ర తదితరులు

చిక్కబళ్ళాపుర, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రివర్గ సమావేశం నేపథ్యంలో చిక్కబళ్ళాపుర జిల్లా అధికారి పీఎన్ రవీంధ్ర శుక్రవారం సన్నాహక సభ నిర్వహించారు. జిల్లాలోని నంది కొండలపై ఈనెల 19న కేబినెట్ భేటీ జరగనుందని, సమావేశంలో పాల్గొనే మంత్రులు, ఇతర ప్రముఖుల బస ఏర్పాట్లకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు. నంది కొండల ప్రవేశద్వారం నుంచి ఎగువసభ వేదిక వరకు రోడ్డుపక్కన చెత్తాచెదారం లేకుండా చూడాలని, రోడ్డుపై గుంతలు ఉంటే మరమ్మతు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించేందుకు మొత్తం 19 కమిటీల ద్వారా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ సీఈఓ ప్రకాశ్, జిల్లా ఎస్పీ కుశల్ చౌక్సి, డిప్యూటి కలెక్టర్ డాక్టర్ ఎన్ భాస్కర్, డిప్యూటి డివిజనల్ అధికారి డీహెచ్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో క్రియాశీలకం కావాలి

విజయపుర, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు క్రియాశీలకం కావాలని బెంగళూరు వీవీఎస్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ అబ్రహం వర్గీస్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకాలో స్థానిక చన్నరాయపట్టణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విజయపుర శ్రీనిధి ప్లాంట్ హెల్త్ క్లినిక్, బెంగళూరు వీవీఎస్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాస్టిక్ రహిత భవిష్యత్తు - కీటకాల సంరక్షణ అనే కార్య క్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ సైటోశ్యానిటరీ పరి శోధనా సేవా కేంద్రం డాక్టర్ రశ్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత కోసం బట్టల సంచుల ఉయోగించాలని సూచించారు. కార్య క్రమంలో భారతీయ కిసాన్‌సంఘం తాలూకా అధ్యక్షుడు ఎన్ నాగరాజయ్య, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, శ్రీనిధి ప్లాంట్ హెల్త్ క్లినిక్ రాఘవేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైల, ఉపా ధ్యాయులు నగీనాతాజ్ తదితరులు పాల్గొన్నారు.



జాగృతి కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు

విద్యాసాధకుడు నరసింహయ్య

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ కళాశాలల ఏర్పాటు ద్వారా లక్షలాదిమందికి ఉన్నతవిద్యను అందించిన ఘనత నరసింహయ్యదేనని ఎన్ఈఎస్ ఛైర్మన్ డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య అభిప్రాయపడ్డారు. పద్మభూషణ్ నరసింహయ్య 106వ జయంతిని శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. నరసింహయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 1935లో బెంగళూరు నేషనల్ హైస్కూల్‌ను ప్రారంభించారని, ఆ తర్వాత గౌరిబిదనూరుతోపాటు వివిధ ప్రాంతాలలో విద్యాసంస్థలు ఏర్పాటు చేశారన్నారు. గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి, కోశాధికారి తల్లం ద్వారకనాథ్, అరుణ్‌కుమార్, వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.



నరసింహయ్య విగ్రహానికి నివాళులు

19న జీవరక్ష ఆధ్వర్యంలో సదస్సు

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న తరుణంలో నియంత్రణకోసం పలు జాతీయ సంస్థల సహకారంతో జీవరక్ష ట్రస్టు సదస్సు నిర్వహించనుంది. సరిహద్దుల తోపాటు పలు ప్రాంతాలలో మనుషులను రక్షించడం, వారి ఆరోగ్యాలను కాపాడడం సవాల్‌గా మారిందని, జీవరక్ష సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర చర్చాగోష్ఠి జరిపేలా ఈనెల 19న కమ్యూనిటీ బేస్డ్ డిజాస్టర్ మేనేజిమెంట్ (సీబీడీఎం) ఆధ్వర్యంలో జరగనున్నట్లు జీవరక్ష సంస్థ వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్ ఎంఏ బాలసుబ్రమణ్యం ప్రకటించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పరిధిలోని జేఎన్ టాటా ఆడిటోరియంలో ఇండియన్ రైల్వే డిజాస్టర్ మేనేజిమెంట్ సమ్మేళనం జరపనుంది. జీవరక్ష ట్రస్టు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, స్వామి వివేకానంద యువ పోరాటం, ఎన్‌డీఎంఏ, ఇస్రో, నిమ్హాన్స్‌తోపాటు పలు జాతీయసంస్థలతో సదస్సు నిర్వ హిస్తున్నామని బాలసుబ్రమణ్యం తెలిపారు. ప్రకృతితోగానీ, సంఘర్షణతోగానీ విపత్తు సంభవించినప్పుడు ప్రాణాలు కాపాడడం విజయవంతమైనదన్నారు. ఇటీవల భారత్ - పాక్‌ల మధ్య భీకరమైన ఘటనలు జరిగినప్పుడు రాజనీతి, ఆయుధాలతోనే కాకుండా ఆరోగ్యం, సానుభూతి విషయంలో కూడా సిద్ధంగా ఉండాలనేది రుజువు చేసిందన్నారు. రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం, స్వామి వివేకానంద యువ చైతన్యంల ద్వారా జీవరక్ష సంస్థ స్థాపించబడింది. సంస్థ అత్యవసర వేళల్లో సేవలందించడంతోపాటు విశ్వవిద్యాలయ స్థాయి గుర్తింపు పొందిన కోర్సులు, పారా మెడికల్ సిబ్బందితోపాటు ప్రజలలో అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంపై చైతన్యం కలిగించేందుకు పనిచేయనుంది. సదస్సులో పాల్గొనేందుకు డాక్టర్ హరిప్రియ 9738037489 ను సంప్రదించాలని తెలిపారు.

మాజీ మంత్రి ఉమాశ్రీ సహా 16మంది మహిళా సాధకులకు వావ్ పురస్కారం



పద్మశ్రీ గ్రహీత విజయలక్ష్మి దేశ్‌మానెకు సత్కారం

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నటి ఉమాశ్రీ సహా 16మంది సాధకులకు ఉమెన్ ఆఫ్ వర్త్ (వావ్) పురస్కారాలను ప్రదానం చేశారు. నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ రంగస్థలనటి, పద్మశ్రీ గ్రహీత జయశ్రీ, క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మశ్రీ గ్రహీత విజయలక్ష్మి దేశ్‌మానెలను ఉబుంటు మహిళా బృందం సత్కరించింది. ఉబుంటు వ్యవస్థాపకురాలు రత్నప్రభ, పరిశ్రమలశాఖ కార్యదర్శి డాక్టర్ రాజ్‌కుమార్ ఖత్రితోపాటు పలువురు పాల్గొన్నారు. మహిళలు పారిశ్రామిక, సమాజసేవలో ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు. వెయ్యిమందికిపైగా విభిన్నరంగాల మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణం అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విశ్వనాథ్ తదితరులు

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ అభిప్రాయపడ్డారు. ఆదిత్య గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బీఏ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణానికి అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి మొక్కల సంరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు.

పల్లెల్లో పెరుగుతున్న కంటి సమస్యలు

రోబోటిక్‌తో సురక్షిత చికిత్సలు

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో కంటి సమస్యలు పెరుగుతున్నాయని సకాలంలో వైద్యులను సంప్రదించకుండా సమస్యల పాలవుతున్నారని డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి రీజనల్ చీఫ్ డాక్టర్ అర్చనా అభిప్రాయపడ్డారు. అగర్వాల్ ఆసుపత్రిలో రోబోటిక్ క్యాటరాక్ట్ శస్త్రచికిత్సల విభాగాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కంటి సమస్యలను తీవ్రంగా పరిగణించడం లేదని, అందుకే కొంతకాలం తర్వాత సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. 2022-23లో రాష్ట్రవ్యాప్తంగా 4.2 క్యాటరాక్ట్ ఆపరేషన్‌లు చేశామన్నారు. చాలామంది భయం, తప్పుడు సమాచారంతో డోలాయమానంలో పడుతున్నారన్నారు. సమగ్రమైన వైద్య విధానం, మెరుగైన ఆరోగ్యానికి కారణమన్నారు. రీజనల్ క్లినికల్స్ విభాగం చీఫ్ శ్రీపతి మాట్లాడుతూ రోబోటిక్ విధానంతో సులభతరంగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. 40ఏళ్లు పైబడినవారు కంటి చికిత్సలు చేయించుకోవాలన్నారు. చదివేందుకు ఇబ్బంది అని కళ్లజోడు మార్చుకోవడం కాదని, గ్లూకోమా, రెటీనా సమస్యలు కూడా పరిష్కరించుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలి

సోమందేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు 12న పునఃప్రారంభం అవుతున్నందున మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు సక్రమంగా భోజనం వండి విద్యార్థులకు అందించాలని ఎంఈఓ-2 ఆనంద్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏజెన్సీ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా ఉండాలన్నారు. మెనూ ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. భోజనాన్ని పాఠశాల వద్ద వంట గదుల్లో లేక ప్రాంగణంలో వండాలన్నారు. ఇంటివద్ద వంట చేసి తీసుకురాకూడదన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1600.16	1,578.14
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,779	1581
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	255	10
నీటి నిల్వ (టీఎంసీలు)	21.73	3.63

16న బియ్యం, గోధుమల

బహిరంగ వేలం

బళ్లారి గాంధీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆహార పౌరసరఫరా శాఖ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా జరిపిన దాడుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని వేలం వేయనున్నారు. 4,550.74 క్వింటాళ్ళ బియ్యం, 63.20 క్వింటాళ్ళ గోధుమలు ఈనెల 16వ తేదీన ఉదయం 11గంటలకు కర్నాటక ఆహార పౌరసఫరా శాఖ ఆధ్వర్యంలో గోడౌన్‌లలో బహింగ వేలం వేయనున్నట్లు ఆహార పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సకీనా ఒక ప్రకటనలోతెలిపారు. ఇందుకు సంబంధించి సమాచారం కోసం జిల్లాఆహార పౌరఫరా శాఖ, బళ్ళారి కార్యాలయంలో సంప్రదించి వివరాలు పొందవచ్చని తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



నాగరాజు మృతదేహం

బళ్లారిరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి చెందడంతో విషాదం నెలకొంది. బళ్లారి నగరంలో గాంధీనగర్ ఫస్ట్ క్లాస్ సమీపంలో బీకేఎస్ హాస్పిటల్ సమీపంలో గురువారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఎత్తినబూదేహళ్ గ్రామానికి చెందిన నాగరాజు సీఎ్ ఎడీ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేపడ్తుండగా జనరేటర్ నుంచి కరెంటు రిటర్న్ సప్లయ్ కావడంతో కిందడిన నాగరాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై గంధనూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు సింధిగేరి గోవిందప్ప నాయక్

అధికారుల నిర్లక్ష్యంతో లైన్‌మన్ మృత్యువాత పడ్డాడని, నాగరాజు కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సహాయం అందించాలని ప్రొఫెసర్ నంజుండస్వామి రైతు రాజ్యం కార్యదర్శి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం మోకా సమీపంలో ఉన్న కేఈబీ ఆఫీస్ వద్ద చేపట్టిన ఆందోళనలో వారు మాట్లాడుతూ లైన్‌మన్ మృతి చెందితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నాగరాజు మృతి చెంది 24 గంటలైనా ఆయన కుటుంబాన్ని ఏఒక్క అధికారి కూడా పరామర్శించలేదని మండిపడ్డారు. కనీసం జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. మరోసారి ఇలా జరగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాగజారు కుటుంబానికి తగిన సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

సర్కార్ నిర్లక్ష్యంతోనే అభిమానుల మృతి

- ఏ-1 గా సీఎం, ఏ-2గా డీసీఎం, ఏ-3గా హోంమంత్రిపై కేసు పెట్టి.. అరెస్ట్ చేయాలి
- సీబీఐతో విచారణ చేయించాలి
- బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి శ్రీరాములు ధ్వజం

బళ్లారి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఆర్‌సీబీ క్రికెట్ జట్టుకు సన్మాన కార్యక్రమంలో జరిగిన తొక్కిస లాటలో 11 మంది అభిమానులు ప్రాణాలు పోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి శ్రీరాములు ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలో హావంబావి సమీపంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన శ్రీరాములు ప్రమాదానికి కారకులైన సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బీజేపీ నాయకుడు, డిమాండ్ చేశారు. ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడారని, 60 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారని ధ్వజమెత్తారు. ఆర్‌సీబీ అనే క్రికెట్ టీం ఓ ప్రైవేటు వ్యక్తి నడుపుతున్న జట్టు అని ఇలాంటి టీంకు కర్నాటక ప్రభుత్వం సన్మానం చేయడమే విడ్డూరమన్నారు. సన్మానం చేసినా అభిమానులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు నిర్వహించలేకపోయారన్నారు. ప్రభుత్వం తుగ్లక్‌లా వ్యవహరించిందన్నారు. విధానసౌధలోనే సన్మానం చేసి, చిన్నస్వామి స్టేడియం వరకు ఊరేగింపునకు ఎంత మంది వస్తారో ఊహించలేక పోయారన్నారు. ప్రభుత్వం, ఆర్‌సీబీ టీం మృతులకు నష్టపరిహం చెల్లిస్తున్నారు. ఇక్కడ పరిహారం అనేది ప్రశ్న కాదు, అక్కడికి వచ్చి ప్రాణాలు కోల్పోయిన వారిలో వేల కోట్లకు పడగలెత్తిన ఆస్తిపరులూ ఉన్నారు. పరిహారం వారి బాధ తీర్చలేదన్నారు. ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం వెంటనే రాజీనామా చేయాలని, సీబీఐకి కేసు అప్పగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. అల్లు అర్జున్ సినిమాకు వెళ్లిన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒకరు మృతి చెందితే, ఇందుకు బాధ్యుడిగా సినీ హీరో అల్లు అర్జున్ పై కేసు పెట్టి అరెస్టు చేశారన్నారు. ఇక్కడు కూడా సీఎ, డీసీఎంలపై కేసు నమోదు చేయాలన్నారు. విలేకరులు సమావేశంలో బుడా మాజీ అధ్యక్షుడు, బీజేపీ కార్పొరేటర్ ఇబ్రహీం బాబు, గోవింద రాజులు, కోనంకి తిలక్, తిమ్మప్ప, దివాకర్, మల్లనగౌడ, తదితర బీజేపీ కార్పొరేటర్ల, నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

అవకతవకలపై విచారణ చేపట్టాలి

- వీఎస్కేయూ ముందు ఏబీవీపీ ఆందోళన



యూనివర్సిటీ ముందు ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

బళ్లారి సిటీ, జూన్6(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో అవకతవకలపై విచారణ చేపట్టాలని శుక్రవారం విశ్వవిద్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు విద్యార్థుల విద్యా అభివృద్ధికి కృషి చేయాలని, ఉన్నత విద్యలో పరివర్తన తీసుకురావడంలో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో కీలకమన్నారు. కాన్వకేషన్ సర్టిఫికేట్ ఫీజు ఇతర విశ్వవిద్యాలయాలతో పోలిస్తే ఇక్కడ రెండు రెట్లు అధికంగా ఉందన్నారు. గ్రామీణ విద్యార్థులకు భారంగా మారిన ఫీజులను తక్షణమే తగ్గించాలన్నారు. కాన్వొకేషన్ సర్టిఫికేట్ ఫీజును వెంటనే రూ.3025కి తగ్గించాలని కోరారు. అదనంగా డిగ్రీ సర్టిఫికేట్ల పంపిణీలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరవింద్, నగర కార్యదర్శి నవీన్ హంగర్, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ హంపపట్న, కార్యకర్తలు దర్శన్, మారుతి, సాగర్ ,దిలీప్, మారుతీ,సంతోష్, వెంకట్ , రూపాలికా, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు పగులగొట్టిన కానిస్టేబుల్

రాయచూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలు పరిరక్షించాల్సిన హెడ్ కానిస్టేబుల్ గాడి తప్పాడు. ఘర్షణను నివారించి ప్రజలకు సేవ చేయాల్సిన పోలీసు తానే గాడి తప్పి విధ్వంసానికి దిగాడు. దేవదుర్గ డిపోకు చెందిన బస్సు అద్దం పగలగొట్టి తన ప్రతాపాన్ని ప్రయాణికుల ముందు రెచ్చిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం దేవదుర్గ నుంచి రాయచూరుకు వస్తున్న ఈ బస్సులో ప్రయాణించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సీట్ విషయంలో పక్కలో ఉన్న వయోవృద్ధుడితో వాగ్వాదానికి దిగాడు. సింగల్ మాన్ సర్వీస్ ఉన్న ఈ బస్సులో కండక్టర్ కం డ్రైవర్ సురేశ్ బాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు నచ్చచప్పే ప్రయత్నం చేసినా ఆయన తన ధోరణి మార్చుకోకుండా పలువురిపై విరుచుకుపడ్డారు. ప్రయాణి కులతో ఘర్షణకు దిగిన ఆయన బస్సు దిగి వెళ్తూ రాయితో అద్దం పగలగొట్టడంతో అందరూ ఆశ్చర్యపోయారు.



పగిలిపోయిన బస్సు అద్దం

ఘనంగా గంగాపరమేశ్వరి జయంతి



ఊరేగింపులో గంగాసమాజ సభ్యులు

బళ్లారి సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేటలో గంగాపరమేశ్వరి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని గంగామతస్థులు గంగాపరమేశ్వరిదేవి చిత్రపంతో ఊరేగింపు గంగమతస్థులు నిర్వహించారు. సన్నక్కి వీరభద్రేశ్వర ఆలయం నుంచి అన్ని సంగీత వాయిద్యాలతో ప్రారంభమైన ఊరేగింపు డ్యాంరోడ్డు ,వాల్మీకి సర్కిల్, చిత్రకేరి, మదకరినాయక్ సర్కిల్ మీదుగా సాగి గంగామాత ఆలయం వరకు జరిగింది. సంఘంలోని మహిళలు పూర్ణ కుంభాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈసందర్భంగా గంగమత సమాజ అధ్యక్షుడు గాలెప్ప, ఉపాధ్యక్షుడు మద్ది సన్నప్ప, మేఘనాథ్, రమేశ్, మద్ది హనుమంతప్ప, వెంకప్ప, దురుగప్ప, శాంతప్ప, మిరయప్ప, ఈరన్న, నిందిహళ్ళి నాగరాజు, హులుగప్ప పాల్గొన్నారు.

పాఠశాలలో ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, జూన్6(ఆంధ్రజ్యోతి): అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం 5వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో ఒక గదికి, తాలుకాలోని ఊకూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మరొక గది నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల చదివించాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు కరిబసప్ప, కౌన్సిలర్ గణేష్, నజీర్, మోహిద్దీన్, గౌరవర శ్రీనివాస, గ్రామస్థులు పాల్గొన్నారు.



వాహనదారులకు హెల్మెట్ అందజేస్తున్న ఎస్పీ శోభారాణి

హెల్మెట్ విషయంలో సడలింపు లేదు

- తప్పనిసరిగా ధరించాల్సిందే: ఎస్పీ శోభారాణి

బళ్లారి గాంధీనగర్/రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మనిషి జీవితం చాలా విలువైనదని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ శోభారాణి ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో జరుగుతున్న మోటారు సైకిళ్ళ ప్రమాదాల్లో చాలామంది ప్రాణాలు కోల్పోతున్న కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మోటారు సైకిల్ వాహన దారులు తప్పకుండా హెల్మెట్ వాడాలని, ఈ విషయంలో ఎలాంటి సడలింపు ఇచ్చేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ప్రజలను హెచ్చరించారు. కనకదుర్గమ్మ సర్కిల్‌లో 'సురక్షిత కోసం హెల్మెట్' అనే కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు హెల్మెట్ అందజేసి జాగృతి కల్పించారు. మోటారు సైకిల్‌పై వెళ్తున్న ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే సమయంలో ప్రమాద వశాత్తు ప్రాణాలు కోల్పేతే కుటుంబ సభ్యులు రోడ్డున పడాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్ళలోపు కలిగిన పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లితండ్రులు చట్టరీత్యా కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్, రవికుమార్, బళ్ళారి ఉప విభాగం డివైఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సబ్‌ఇన్స్‌స్పెక్టర్ అయ్యనగౌడలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలి

- పర్యావరణాన్ని కాపాడుకోవాలి: డీహెచ్ఓ రమేష్ బాబు



మొక్కకు నీరు పోస్తున్న డీహెచ్ఓ రమేష్ బాబు

బళ్లారి గాంధీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మట్టిలో కలిసిపోకుండా, పరిసర మాలిన్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ ఉపయోగం సంపూర్ణంగా నిర్మూలించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఉత్తమ పరిసరాలు అందివ్వాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. రోజురోజుకూ పరిసరాలపై అత్యంత ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా డాక్టర్ అబ్దుల్లా, జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ పూర్ణిమ కట్టిమని, జిల్లాక్షయరోగ నిర్మూలనా అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, జిల్లా ఆరోగ్య శక్షణ అధికారి ఈశ్వర్ హెచ్.దానప్ప, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ ప్రియాంక మలేరియా, కుష్టరోగ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సండూరులో..



పాఠశాలలో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

బళ్లారి సిటీ: పట్టణంతో సహా తాలూకా పరిధిలోని గ్రామాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడానికి అన్నితాలూకా స్థాయి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సండూర్ ఎమ్మెల్యే అన్నపూర్ణ సూచించారు. సండూరులో పర్యావరణ దినోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినప్పుడే పర్యావరణానికి న్యాయం చేయగలమన్నారు. నెలపాటు పర్యావరణ వారోత్సవాన్ని నిర్వహించి సుమారు 60వేల మొక్కలు నాటడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

బళ్లారి రూరల్: తాలుకాలోని గోడేహాళ్ తిరుమల స్కూలు ఆవరణంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కరెస్పాండెంట్ యల్లప్ప, హెచ్‌ఎం నాగరాజు స్కూలు ఉపాధ్యాయ నేతృత్వంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కరస్పాండెంట్ యల్లప్ప తెలిపారు.



తిరుమల స్కూలు ఆవరణలో మొక్క నాటుతున్న టీచర్లు

మాజీ సీఎం దేవరాజ అరసుకు ఘన నివాళి



అరసు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీసీ కార్యాలయ సిబ్బంది

సిరుగుప్ప, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దున్నేవాడితే భూమి అని చెప్పిన ఏకైక వ్యక్తి దేవరాజు అరసు అని బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం బీసీ సంక్షేమ శాఖలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి దేవరాజ అరసు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సమాజ సేవకులు అబ్దుల్ నబీ, రహీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజుల్లో గృహలక్ష్మి సొమ్ము ఖాతాల్లోకి..

రాయచూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాల్లో ఒకటైన గృహలక్ష్మి పథకం లబ్దిదారుల ఖాతాల్లో త్వరలోనే నగదు జమ కానుందని పథకం అమలుకు సంబంధించి జిల్లా కమిటీ అధ్యక్షుడు పామయ్య మురారి తెలిపారు. శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన జిల్లాకు చెందిన 2,58,399 మంది లబ్దిదారులకు 2025-26వ సంవత్సరానికి సంబంధించి రెండవ విడత నగదు డీబీటీ పద్దతిలో జమ చేస్తున్నట్లు తెలిపారు. డీబీటీ విధానంలో 51,67,98000 రూపాయిలను జమ చేసేందుకు అనుమతించినట్లు తెలిపారు. రెండు-మూడు రోజుల్లో లబ్దిదారులందరికి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు.

హోసూరు జోన్

వరదరాజస్వామికి విశేష పూజలు

హోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏకాదశిని పురస్కరించుకుని శూలగిరిలోని వరదరాజస్వామికి, మహాలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక హోమాదికాలు, అలంకరణ, దీపారాధన నిర్వహించారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హోసూరు, శూలగిరి ప్రాంతాలతోపాటు సరిహద్దులోని కోలారు, మాలూరు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు సమర్పించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



అలంకరణలో శ్రీవారు

కారు బోల్తా.. వ్యక్తి మృతి

రాయచూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు టైరు బ్రస్ట్ కావడంతో బోల్తాగొట్టింది. ఈ సంఘటన జిల్లాలోని లింగసుగూరు తాలూకా అమరేశ్వర్ క్యాంప్ క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. అమరేశ్వర్ క్యాంప్ నుంచి దేవరభూపూరు గ్రామానికి వెళుతున్న ఈ కారు ప్రమాదానికి గురి కావడంతో అందులో ప్రయాణిస్తున్న తిమ్మనగౌడ(32) అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు అమరేశ్‌కు తీవ్ర గాయాలైయ్యాయి. ప్రమాద వార్త తెలిసుకున్న లింగసుగూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రుడిని లింగుగూరు తాలూకా ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఒక శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

నకిలీ కరెన్సీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

హోసూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ కేసులో ఒక పూజారి సహా ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. డెంకణీకోట సమీపంలోని బాల్కేరి గ్రామం కాళియమ్మన్ ఆలయానికి మదమ్మల్ అనే వ్యక్తి తన కుటుంబ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక పూజలు చేయించాలని ఆలయ పూజారి రవిని కోరారు. పూజల అనంతరం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి అక్కడికి వచ్చి నల్లధనం ఉందని, రసాయనంలో ముంచి బయటకు తీస్తే డబ్బుగా మారుతుందని నమ్మించాడు. దీంతో ప్రభుకు మదమ్మల్ రూ.40వేలు ఇచ్చాడు. అనంతరం ప్రభు రెండు కట్టల నగదును ఒక కవరులో మదమ్మల్‌కు ఇచ్చాడు. తర్వాత మదమ్మల్ ఇంటికి వెళ్లి చూడగా నకిలీదిగా తెలుసుకుని ఆమె షాక్‌కు గురైంది. దీంతో మదమ్మల్ స్థానిక డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ గణేశ్‌కుమార్, ఎస్సై నాగరాజ్‌లు గురువారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిలో ఆలయ పూజారి రవి (65), అతడి సహచరులు నంజుండన్ (45), మునికృష్ణన్ (35)లను అరెస్టు చేశారు. మరికొంత మంది కోసం గాలింపులు చేపట్టారు.

ఆక్రమణలు తొలగించాలి: సీపీఎం

హోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పాలన ఏకపక్షంగా ఉందని, రాజకాలువ ఆక్రమణల తొలగింపులో వివక్షత చూడరాదని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో హోసూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పార్టీ నగర కార్యదర్శి నగేషబాబు ధర్నాకు అధ్యక్షత వహించారు. కార్పొరేషన్ డిప్యూటి కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం నగేష్‌బాబు మాట్లాడుతూ శాంతినగర్‌లోని ఒక పేద మహిళ తన ఇంటికి నీటి కనెక్షన్ అడిగి 8 నెలలు గడిచినా ఇంకా ఇవ్వలేదన్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది రాజకాలువకు ఇరువైపులా అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని, ఒక పేద మహిళ ఇంటి షెడ్‌పై కప్పు కూల్చి అరాచకం సృష్టించారన్నారు. పేద మహిళకు న్యాయం చేయాలని, ఆక్రమణలు తొలగించాలన్నారు. ధర్నాలో జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మహాలింగం, జేమ్స్ ఏంజెలా మేరి, నంజుండన్, యునైటెడ్ సెక్రటరీ దేవరాజ్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవం

హోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో అర్థవంతంగా నిర్వహించారు. జూజువాడి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మునిరాజ్ నేతృత్వంలో మొక్కలు నాటారు. టైటాన్ జ్యువెలరీ కంపెనీ ఆధ్వర్యంలో 10వేల మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయురాలు ఆర్ నర్మదాదేవి స్వాగత ప్రసంగం చేశారు. కంపెనీ సీఎంఓ ఆర్ శరత్ ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రతి విద్యార్థి ఒక్కో మొక్క నాటారు. లెటజ్ సేవ్ గ్రీన్ అనే థీమ్‌తో కెలమంగల సర్కిల్ పరిధిలోని నాగమంగలం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలు నాటారు. జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు